

మూడు వేల ఎకరాల్లో జీడి మామిడి

● మొక్కలు నాటేందుకు సిద్ధం: డ్వామా పీడీ

కొమరాడ, ఆగస్టు 7 : జిల్లాలో మూడు వేల ఎకరాల్లో జీడి మామిడి నాటేందుకు సిద్ధంగా ఉన్నామని డ్వామా పీడీ కె.రామచంద్రరావు తెలిపారు. కంబవలస, విక్రంపురం, తదితర గ్రామాల్లో నాటిన జీడి మామిడి మొక్కలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ ఏడాది కొమరాడ మండలంలో 151 ఎకరాల్లో గుంతలు తవ్వి జీడి మామిడి మొక్కలు నాటనున్నామని తెలిపారు. ఈ వారంలోపు మొక్కలు పంపిణీ చేస్తామన్నారు. మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చులు అందిస్తామన్నారు.

ఆదివాసీ దినోత్సవానికి సన్నద్ధం

● ఘనంగా ఏర్పాట్లు చేయండి ● అధికారులకు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశం

పార్వతీపురం, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఈనెల 9న ఆదివాసీ దినోత్సవం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ... వేడుకలకు సీఎం చంద్రబాబునాయుడు రానున్న దృష్ట్యా పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా వేడుకలు నిర్వహించాలని ఆదేశించారు.

వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక..

వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలను వెంటనే తయారు చేసి అందజేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడుతూ.. వంద రోజుల కార్యాచరణను జిల్లా, మండల, గ్రామస్థాయిలో తయారు చేయాలన్నారు. ఇంటర్ విద్యార్థినులను కూడా వసతిగృహాలు ఏర్పాటు చేయాలన్నారు. డ్రాపౌట్స్ విద్యారులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. టెన్త్, ఇంటర్ దూర విద్యా విధానం కోర్సులో ప్రవేశాలకు నమోదు చేయించాలన్నారు. ప్రతి అధికారి నెలలో ఒక రోజుల గ్రామంలోకి వెళ్లి ప్రజలకు సేవలు అందించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జేసీ శోభిక, ఐటీడీఏ పీవో సేదు మాధవన్, ఇన్‌చార్జి డీఆర్వో కేశవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట ఐటీడీఏలో..

సీతంపేట: ఆదివాసీ దినోత్సవం నేపథ్యంలో సీతంపేట గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో ఘనంగా ఏర్పాట్లు చేయాలని ఐటీడీఏ పీవో టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. గిరిజన సంస్కృతికి సంబంధించిన సాంస్కృతిక ప్రదర్శనలు, స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐటీడీఏ ఆవరణ, స్టేడియం వద్ద పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఏపీవో చినబాబు, ఎంపీడీవో గీతాంజలి, పాలకొండ మున్సిపల్ కమిషనర్ సర్వేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

మన్యంలో నాగాలాండ్ పైనాపిల్

● సాగుకు ఐటీడీఏ కసరత్తు ● డీపీఆర్ సిద్ధం చేసిన ఉద్యాన శాఖ
● ఈ రకం సాగుపై సందేహాలెన్నో.. ● దిగుబడులు రావంటున్న గిరిజన రైతులు

సీతంపేట: సీతంపేట మన్యంలో నాగాలాండ్ పైనాపిల్ సాగుకు ఐటీడీఏ కసరత్తు చేస్తోంది. ఈ మేరకు ఉద్యాన శాఖాధికారులు డీపీఆర్‌ను సిద్ధం చేస్తున్నారు. వాస్తవంగా మండలంలో రైతులు కొన్నేళ్లుగా పది వేల ఎకరాలకు పైగా సింహాచలం లోకల్ రకానికి చెందిన పైనాపిల్ సాగు చేపడుతున్నారు. పోడు వ్యవసాయంలో అంతర పంటగా సాగుచేస్తున్న ఈ పైనాపిల్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఐదు వేలకు పైగా గిరిజనులు ఉపాధి పొందుతున్నారు. దీనికి మైదాన ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది. దీంతో వ్యాపారులు పెద్ద ఎత్తున ఇక్కడకు తరలివచ్చి ఈ పైనాపిల్‌ను కొనుగోలు చేస్తున్నారు. గతంలో ఒక్కో పండు ధర రూ. 10 నుంచి రూ.20 వరకు ఉండేది. ఇటీవల కాలంలో దాని ధర పెరగడంతో గిరిజన రైతులు ఈ సాగుపై దృష్టిసారిస్తున్నారు. గతంలో సీతంపేట మన్యం నుంచి పైనాపిల్ పిలకలను రంపచోడవరం, అల్లూరి సీతారామరాజు జిల్లా, విజయనగరం వంటి ప్రాంతాలకు గిరిజనులు పంపిణీ చేసేవారు. దీంతో అయా ప్రాంతవాసులు కూడా పైనాపిల్ సాగుతో ఎంతో లబ్ధిపొందారు.

నిల్వ ఉండే అవకాశం లేక..

సింహాచలం రకానికి చెందిన పైనాపిల్‌లో పులుపు అధికంగా ఉంటుంది. అంతేగాకుండా ఈ పండ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉండే అవకాశం లేదు. పంట దిగుబడికి వచ్చిన మూడు రోజులు వ్యవధిలోనే అమ్మకాలు చేపట్టాల్సి ఉంది. దీంతో గిరిజనులు రైతులు నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో దాని స్థానంలో నాగాలాండ్‌కు చెందిన క్యూవెరైటీ రకం పైనాపిల్‌ను ఈ ప్రాంత గిరిజనులకు అందజేయడానికి ఐటీడీఏ ఉద్యాన శాఖాధికారులు డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు. ఈ రకానికి చెందిన పైనాపిల్ ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. దీంతో గిరిజనులు రైతులు మరింతగా లబ్ధిపొందే అవకాశం ఉంది. ఈ మేరకు దశల వారీగా ఈ ప్రాంతంలో నాగాలాండ్ పైనాపిల్ సాగు విస్తీర్ణం పెంచాలని ఐటీడీఏ అధికారులు భావిస్తున్నారు.



నాగాలాండ్‌కు చెందిన క్యూ వెరైటీ పైనాపిల్ ఇదే..

ఆశించిన స్థాయిలో దిగుబడులు వచ్చేనా?

నాగాలాండ్ పైనాపిల్ సాగుపై గిరిజన రైతులు అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా నాగాలాండ్ ప్రాంతాల్లో శీతల వాతావరణం కాబట్టి.. అక్కడ సాగుకు ఎటువంటి ఇబ్బంది ఉండదు. దిగుబడులు, ఆదాయానికి ఢోకా ఉండదు. కానీ అక్కడితో పోలిస్తే.. జిల్లా వాతావరణ పరిస్థితులు వేరేగా ఉంటాయి. ఈ ప్రాంతంలో ఉష్ణోగ్రత హెచ్చుతగ్గులు ఉండడం వల్ల ఆశించిన స్థాయిలో నాగాలాండ్ పైనాపిల్ దిగుబడి వచ్చే అవకాశం ఉండదని గిరిజను రైతులు అభిప్రాయపడుతున్నారు. గతంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈ రకం పైనాపిల్ పిలకలను సరఫరా చేసినప్పటికీ వాటి ఫలసాయం రాలేదని చెబుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై ఐటీడీఏ ఉద్యాన శాఖాధికారి వెంకట గణేష్‌ను వివరణ కోరగా.. ఈ ప్రాంతంలో నాగాలాండ్, కేరళకు చెందిన క్యూవెరైటీ రకం పైనాపిల్ విత్తనాలను పంపిణీ చేయనున్నామని తెలిపారు. మొదటి విడతలో ఎన్ని ఎకరాల్లో సాగు చేపట్టాలనే దానిపై ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.

విద్యార్థులకు
నాణ్యమైన భోజనం పెట్టండి

● పార్వతీపురం ఐటీడీఏ పీవో మాధవన్

కురుపాం,ఆగస్టు7: విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని పార్వతీపురం ఐటీడీఏ పీవో సేదు మాధవన్ ఆదేశించారు. బుధవారం కురుపాం ఏపీ గురుకుల బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వంటగది, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. విద్యార్థినుల హాజరు మెనూను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన విద్యతో పాటు భోజనం కూడా అందించాలని, ఈ విషయంలో రాజీ పడరాదని సూచించారు. విద్యార్థులు వ్యాధులు బారిన పడకుండా చూడాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ప్రిన్సిపాల్ సత్యవతిని ఆదేశించారు. అనంతరం కురుపాంలో ఏకలవ్య పాఠశాల పనులను పరిశీలించారు. త్వరగా నిర్మాణం పూర్తి చేయాలని ఈఈ శాంతేశ్వరరావును ఆదేశించారు. ఆయన వెంట ఏటీడబ్ల్యూవో కె.చంద్రబాబు తదితరులు ఉన్నారు.

పనుల పరిశీలన

గుమ్మలక్ష్మీపురం: పెంగువ, గొరడ వద్ద హాట్ బజార్ , ఈఆర్ రోడ్డు-కనాసింగ్ రోడ్డు పనులను ఐటీడీఏ పీవో మాధవన్ పరిశీలించారు. అనంతరం వైటీసీలో గిరిజన గర్భిణులతో మాట్లాడారు. సౌకర్యాలపై ఆరా తీశారు. గిరి శిఖర గ్రామాల్లో హైరిస్క్ గర్భిణులను గుర్తించి.. హాస్టల్‌కు తీసుకురావాలని సిబ్బందిని ఆదేశించారు. అక్కడి నుంచి నేరుగా గొరడ గ్రామం చేరుకుని.. బాలుర ఆశ్రమ పాఠశాలలో వంట గది, సరుకుల నిల్వల గది, డార్మెటరీ, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. ఆహార పదార్థాల తయారీలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు వేడినీటిని అందించాలని, కచ్చితంగా మెనూ పాటించాలని తెలిపారు.



కురుపాం గురుకుల బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో సరుకులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో

నేడు ఎస్‌ఎంసీ ఎన్నికలు

● 1,582 స్కూళ్లల్లో సర్వం సిద్ధం
● జిల్లాలో రెండు పాఠశాలలు దూరం
● హెల్ప్‌డెస్క్ ఏర్పాటు: డీఈవో



ఎన్నికలకు దూరంగా ఉన్న సాంబన్నవలస పాఠశాల

గరుగుబిల్లి, ఆగస్టు 7 : జిల్లాలోని 1,582 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలను నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికల నిర్వహణ, పాఠశాల కమిటీ సభ్యుల పునర్వ్యవస్థీకరణ, 1.30 గంటల నుంచి ఎస్‌ఎంసీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక ఉంటుంది. 2 గంటలకు ఎస్‌ఎంసీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్‌లతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 3.30 గంటల వరకు మొదటి సమావేశం నిర్వహించనున్నారు. వాస్తవంగా జిల్లాలో ఉన్న 1,584 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 94 వేలకు పైగా విద్యార్థులు ఉన్నారు. అయితే ఇందులో రెండు పాఠశాలలు ఈ ఎన్నికలకు దూరంగా ఉన్నాయి. విద్యార్థులు లేకపోవడంతో గరుగుబిల్లి మండలంలో సాంబన్నవలస, తులసిరామి నాయుడువలస పాఠశాలలు మూతపడ్డాయి. ఈ కారణంగా ఆయా స్కూళ్ల ఎన్నికలకు దూరంగా ఉన్నాయి.

మానటరింగ్ అధికారుల నియామకం

ఎస్‌ఎంసీ ఎన్నికల పరిశీలనకు మానటరింగ్ అధికారులను నియమించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఏఎంవోగా బి.శ్రీనివాసరావును పాలకొండకు, కొమరాడ, వీరఘట్టం మండలాలకు సీఎంవోగా కె.రాజారావును కేటాయించారు. సీతానగరం, పాచిపెంటకు ఏపీవోగా బి.అప్పలనాయుడు, మక్కువ, భామినికి ఏఎస్‌వోగా వి.కిరణ్‌కుమార్, సీతంపేట, గరుగుబిల్లికి ఏఎల్‌ఎస్‌సీవోగా మధుకిషోర్, పార్వతీపురం, బలిజిపేటకు కోఆర్డినేటర్‌గా భాను మూర్తి, గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాలకు ఏఎస్‌వో-1గా హరిప్రసాద్, సాలూరు, జియ్యమ్మవలసకు ఏఏఎల్‌ఎస్‌సీవోగా బి.అప్పలనాయుడును కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల వివరాలను ఆయా మండలాలకు చెందిన ఎంఈవోలు, హెచ్‌ఎంల నుంచి సేకరించి జిల్లా కేంద్రానికి అందించాల్సి ఉందని డీఈవో పగడాలమ్మ తెలిపారు. జిల్లా కేంద్రంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. దీని పర్యవేక్షణకు సీఎంవో కె.రాజారావు (94406 89739), ఏఎంవో బి.శ్రీనివాసరావు(94949 06445) నియమించామని వెల్లడించారు. సమస్యలు ఉంటే ఆయా ఫోన్ నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు. ఎన్నికల పరిశీలకులతో పాటు ఎంపీడీవో, తహసీల్దార్, సచివాలయ కార్యదర్శి, వీఆర్‌వోలను నియమించామని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సిబ్బందికి సూచనలు అందించామని డీఈవో తెలిపారు.

ఎంపీడీవోల బదిలీలకు
గ్రీన్ సిగ్నల్


● మార్గదర్శకాలు విడుదల

గరుగుబిల్లి, ఆగస్టు 7 : ఎన్నికల సమయంలో ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఎంపీడీవోలను సొంత మండలాలకు బదిలీ చేసేందుకు ఉన్నతాధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈమేరకు బుధవారం మార్గదర్శకాలను విడుదల చేశారు. విధి విధానాలకు సంబంధించి జడ్పీ సీఈవోలకు రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ కార్యదర్శి (పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్) శశిభూషణకుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లా నుంచి పలువురు ఎంపీడీవోలు శ్రీకాకుళం, విశాఖ జిల్లాలకు బదిలీ అయ్యారు. కాగా గతంలో ఏ మండలంలో వారు విధులు నిర్వహించారో తిరిగి ఆ ప్రాంతానికే కేటాయించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. మూడేళ్లు పూర్తయిన వారికి జిల్లా స్థాయిలో పదోన్నతి కల్పించాలని ఉత్తర్వులు ఇచ్చారు. కాగా రెండు రోజుల్లో ఎంపీడీవోల బదిలీల ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు.

సమాజంపై బాధ్యతతో వ్యవహరించాలి

● సినీ గేయరచయిత సుద్దాల అశోక్ తేజ

విజయనగరం రూరల్, ఆగస్టు 7: ప్రతి విద్యార్థి చదువుతో పాటు సమాజంపై బాధ్యతతో వ్యవహరించాలని సినీ గేయరచయిత, కవి, గాయకుడు సుద్దాల అశోక్ తేజ పిలుపునిచ్చారు. జిల్లాలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో జాతీయ విద్యావిధానంపై బుధవారం నిర్వహించిన సదస్సుకి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 'మంచి ఆలోచనలు-సృజనాత్మకత, మూర్తిమత్వ వికాసం' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కష్టం వెనుకే సుఖం, బాధ వెనుక సంతోషం, ఆనందం ఉంటుందన్నారు. సహనంతోనే విజయం చేకూరుతుందని తెలిపారు. అత్యంత వెనుకబడిన స్థాయి నుంచి అత్యుత్తమ స్థాయికి ఎదిగినప్పుడే జీవితానికి సార్థకత లభిస్తుందని విద్యార్థులకు వివరించారు. అదే ఫిలాసఫిని తన పాటల ద్వారా తెలియజేస్తున్నానని అన్నారు. అనంతరం తనబాణీ పాటలతో యువతను ఉర్రూతలూగించారు. కళాశాల ఉపకులపతి తేజస్వీ కట్టమణి మాట్లాడుతూ.. జాతీయ విద్యా విధానంలో చదువుతో పాటుగా ఆటలు, పాటలు లలిత కళలు, చిత్రలేఖనం, సాహిత్యం, జాతీయత, సంస్కృతి సంప్రదాయాలు ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ పరిపాలనాధికారి సూర్యనారాయణ, రిజిస్ట్రార్ పి.శ్రీనివాసన్, ప్రొఫెసర్ శరత్‌చంద్రబాబు, జెఎం మిశ్రా, పి.శ్రీదేవి, అనిరుథ్‌కుమార్, సురేష్‌బాబు, దివ్య, లత, డాక్టర్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ

వివరాల సేకరణలో
అలసత్వం వద్దు

● జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి మన్మథరావు

పార్వతీపురం టౌన్, ఆగస్టు 7: పశు వివరాల సేకరణలో అలసత్వం వహించొద్దని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి మన్మథరావు ఆదేశించారు. వారం రోజుల పాటు ఇంటింటికీ వెళ్లి నమోదు చేయాలన్నారు. బుధవారం ఓ ప్రైవేట్ భవనంలో పశుగణనపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లకొకసారి పశుగణన జరుగుతుందన్నారు. ఈ మేరకు జిల్లాలో పశువుల వివరాల సేకరణకు 294 మంది ఎన్యుమరేటర్లు, 25 మంది పశు వైద్యాధికారులు, సూపర్ వైజర్లను నియమించామన్నారు. మొబైల్ యాప్‌లోనే నమోదు చేయాలని, 15 అంశాలపై సమగ్రంగా వివరాలు సేకరించాలని సూచించారు.



మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి



చెరువు కాదండోయ్..

ఇది జియ్యమ్మవలస మండలం పెదమేరంగి జంక్షన్ వద్ద రాష్ట్రీయ రహదారి. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఇలా తయారైంది. ఈ దారిలో భారీ గోతులు ఏర్పడగా.. వాటిల్లో వర్షపునీరు చేరింది. దీంతో ఈ రోడ్డు చెరువును తలపిస్తోంది. వాహనదారులు, ప్రయాణికులు రాకపోకలు సాగించలేకపోతున్నారు. తరచూ ద్విచక్రవాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఒక్కోసారి వాహనాలు గోతుల్లో దిగబడుతుండగా.. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. వాస్తవంగా 2021 మార్చి 28న పార్వతీపురం, విజయనగరం డివిజన్లలో రూ. 147.71 కోట్లతో ఏడు స్టేట్ హైవే రోడ్లు మంజూరయ్యాయి. పార్వతీపురం డివిజన్‌లో మంజూరైన వాటిల్లో తోటపల్లి - గుణుపూర్ రోడ్డు (స్టేట్ హైవే 081) ఒకటి. 14 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. 35.37 కోట్లు మంజూరు చేశారు. అయితే ఇంతవరకు రూ. 19.17 కోట్ల మేర పనులు జరగ్గా.. రూ. 16.50 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మరోవైపు ఈ మార్గంలోనే ఉన్న పెదమేరంగి జంక్షన్ వద్ద రహదారి దారుణంగా తయారైంది. దీనిపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

- జియ్యమ్మవలస

రైట్ టు బి ఫర్గాటెన్ గోప్యత హక్కు!

మనసుకు అయ్యే గాయాన్ని మాన్పే శక్తి కాలానికి ఉందంటారు. అయితే ఆ గాయాన్ని పదేపదే జ్ఞప్తికి తెస్తుంటే? ఒకవేళ చేయని నేరానికి బలైనవారిని, ఆ నేరం వారు చేయలేదని రుజువైనప్పటికీ ఒకప్పుడు నేరారోపణ చేయబడ్డాడని నిరంతరం ప్రచారం చేస్తుంటే? సదరు వ్యక్తులకు ఉన్న వ్యక్తిగత స్వేచ్ఛను, గోప్యత స్వేచ్ఛను ఉల్లంఘించినట్లు కాదా?

ఇదే అంశం ఇటీవల ఒక కేసు రూపంలో సుప్రీం కోర్టు ముందుకు వచ్చింది. గతంలో లైంగికదాడి, మోసం కేసులో ఒక వ్యక్తిని దిగువ కోర్టు నేరస్థునిగా పేర్కొంటూ తీర్పుని ఇచ్చింది. అయితే తరువాత కాలంలో అతన్ని ఎగువకోర్టు నిర్దోషిగా ప్రకటించింది. కానీ లీగల్ సెర్చ్ పోర్టల్ 'ఇండియన్ ఖానూన్'లో దిగువకోర్టు ఇచ్చిన తీర్పు వివరాలు ప్రకటితమవుతుండటంతో సదరు వ్యక్తి దరఖాస్తు చేసుకున్న విదేశీ పౌరసత్వ అప్పీలును తిరస్కరించారు. ఈ ప్రకారం అతడు చేయని నేరానికి మళ్లీ మళ్లీ శిక్షించబడుతున్నట్లే. అదే అంశాన్ని ప్రస్తావిస్తూ ఆ వ్యక్తి మద్రాసు హైకోర్టును ఆశ్రయించి రైట్ టు బి ఫర్గాటెన్'(మరచిపోవు హక్కు)ను అభ్యర్థించాడు. ఇండియన్ ఖానూన్ పోర్టల్ నుంచి తనకు సంబంధించిన తప్పుడు సమాచారాన్ని తొలగించమని ఆదేశించాల్సిందిగా కోరాడు. ఈ నేపథ్యంలో మద్రాసు హైకోర్టు ఇండియన్ ఖానూన్ సంస్థను సదరు వ్యక్తికి సంబంధించిన సమాచారాన్ని తొలగించమని ఆదేశిస్తూ తీర్పునిచ్చింది. ఇండియన్ ఖానూన్ పోర్టల్ ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసింది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ అధ్యక్షతన ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఈ కేసును విచారణకు స్వీకరించడంతో రైట్ టు బి ఫర్గాటెన్' అనే హక్కుకు సంబంధించి కొన్ని నిర్ధారణలు వెలువడనున్నాయి. అసలు రైట్ టు బి ఫర్గాటెన్ అనేది ప్రాథమిక హక్కు అవుతుందా? ఒకవేళ అయితే, అది రాజ్యాంగం ప్రసాదించిన ఇతర ప్రాథమిక హక్కులతో ఏవిధమైన సంబంధం కలిగి ఉంటుంది? అనే అంశాలను దేశ అత్యున్నత న్యాయస్థానం పరిశీలించనుంది.

అసలు రైట్ టు బి ఫర్గాటెన్' అంటే ఏమిటి? ఎవరికి వర్తిస్తుంది? భారతదేశంలో దానికి గల చట్ట, న్యాయపరమైన పునాదులేవి? సదరు హక్కు లాభ - నష్టాలేమిటి? చూద్దాం.

● 'రైట్ టు బి ఫర్గాటెన్' అంటే?

అనవసరమైన లేదా అసందర్భమైన తన వ్యక్తిగత సమాచారాన్ని బహిరంగ సామాజిక వేదికల నుంచి అంటే ఇంటర్నెట్, సెర్చ్ ఇంజన్లు, డేటాబేస్‌లు, వెబ్‌సైట్లు, ఇతరత్రా ఏదైనా సమాచార మాధ్యమాల నుంచి తీసివేయించడానికి ఒక వ్యక్తికి గల హక్కునే రైట్ టు బి ఫర్గాటెన్ లేదా రైట్ టు బి ఎరేజర్ అంటారు.

ఒక వ్యక్తికి సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని ఎటువంటి ఆవశ్యకత, చట్టపర అవసరం లేనప్పటికీ, అందరికీ బహిరంగంగా ఆ సమాచారాన్ని అందుబాటులో ఉంచి, అతని గోప్యతా హక్కును ఉల్లంఘించినప్పుడు ఒక వ్యక్తి రైట్ టు బి ఫర్గాటెన్(రీ) ఎరేజర్‌ను ఆశ్రయించే వీలుంది.

భారత్‌లో ఈ హక్కుకు ఇతిమిద్ధ రూపం లేనప్పటికీ, ఈయూ దేశాల్లో వారు తీసుకువచ్చిన 'జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్(జీడీపీఆర్)' ఈ హక్కును వారికి అందిస్తోంది. అయితే దగ్గర కూడా కొన్ని తీర్పుల్లో, హక్కుల్లో, చట్టాలు, బిల్లుల్లో ఇది ప్రతిఫలిస్తోంది.

● భారతదేశంలో ప్రస్తావనలు

రైట్ టు బి ఫర్గాటెన్ అనే హక్కును, భారత రాజ్యాంగం కల్పిస్తున్న ప్రాథమిక హక్కుల్లోని, జీవించే హక్కు(ప్రకరణ 21)లో అంతర్భాగమైన గోప్యతా హక్కు పరిధిలోకి వచ్చే అంశంగా 'కె.ఎస్.పుట్టస్వామి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసు (2017) తీర్పులో ప్రస్తావించింది. అంతేకాక కొన్ని హైకోర్టులు(ఢిల్లీ, కర్ణాటక) కూడా వివిధ కేసుల్లో ఇంచుమించు ఇదేవిధమైన తీర్పులు ఇచ్చి ఉన్నప్పటికీ, సుప్రీం కోర్టు కె.ఎస్.పుట్టస్వామి కేసు తీర్పులో ఇచ్చిన ప్రాథమిక నియమావళి రైట్ టు బి ఫర్గాటెన్‌కు ఒక ప్రాతిపదికను ఏర్పర్చింది. న్యాయవ్యవస్థకు ఒక మార్గదర్శనం చేసింది.

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఇక చట్టాలపరంగా తీసుకుంటే 'డిజిటల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ (2023)'లో రైట్ టు బి ఫర్గాటెన్‌కు ఒక చట్ట ప్రాతిపదిక కనిపిస్తుంది. వ్యక్తుల వ్యక్తిగత సమాచారాన్ని డిజిటల్ స్పేస్‌లో వారు నియంత్రించుకోగల సౌలభ్య అంశం ఈ చట్టంలో ఉంది. ఏ వ్యక్తి గురించిన వ్యక్తిగత సమాచారం డిజిటల్ స్పేస్‌లో అతడి/ఆమె వ్యక్తిగత గోప్యతకు, ప్రతిష్ఠకు, భద్రతకు నష్టం కలిగించేదిగా ఉన్నప్పుడు దానిని తొలగించమని డేటా నిర్వాహకులను కోరవచ్చు. వారు తొలగించని పక్షంలో రెగ్యులేటరీ అథారిటీ(లేదా) న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు. అంతేకాక ప్రతిపాదిత పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు (2019)లో కూడా రైట్ టు బి ఫర్గాటెన్ గురించిన ప్రతిపాదన ఉంది.

● పరిమితులు

సుప్రీంకోర్టు నిర్దేశనల ప్రకారం, ఒక వ్యక్తి వ్యక్తిగత సమాచారం ఎటువంటి చట్టపరమైన ఆవశ్యకతను కలిగి లేనప్పుడు, అవసరత, సంబంధం కానీ ఇతరత్రా లేనప్పుడు, అసత్యమైనప్పుడు దానిని తొలగించుకునే హక్కును సదరు వ్యక్తి పొందుతాడు.

అయితే భావవ్యక్తీకరణ హక్కుతో ముడిపడినప్పుడు, చట్టపరమైన అవసరాలు గల సమాచారమైనప్పుడు, ప్రజా ప్రయోజనాల సంబంధితమైనప్పుడు రైట్ టు బి ఫర్గాటెన్ వర్తించదని కూడా విస్పష్టం చేయడం జరిగింది.

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/TgHS0Wqలో చూడండి.

దిక్సూచి

లాభ నష్టాలు



ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించినట్లు రైట్ టు ప్రైవసీ(గోప్యతా హక్కు) అనేది రైట్ టు ఇన్ఫర్మేషన్(సమాచార హక్కు)తో సమన్వయం కావాలి. రైట్ టు బి ఫర్గాటెన్' ఎంత ఆవశ్యకమో, సమాచార స్వేచ్ఛ కూడా అంతే అవసరమనే వాద ప్రతివాదనలు ఉన్నాయి.

లాభాలు

- ★ నిరపరాధులు తమ గౌరవాన్ని కాపాడుకోవడానికి వీలవుతుంది.
- ★ సమాచారం తీవ్రంగా దుర్వినియోగం అవుతూ, అసత్యాలు, పాక్షిక సత్యాలు (ఉదా: ఫేక్ న్యూస్, రివేంజ్ పోర్న్, మార్ఫ్‌డ్ కంటెంట్) ప్రచారమవుతున్నఈ డిజిటల్ యుగంలో రైట్ టు బి ఫర్గాటెన్ వంటి హక్కులు వ్యక్తి గౌరవాన్ని, గోప్యతను, ప్రతిష్ఠను రక్షిస్తాయి.
- ★ వ్యక్తిగత భద్రత, స్వేచ్ఛపరంగా అనవసర సమాచారం అందరికీ సులువుగా అందుబాటులో లేకుండా, మోసాలు, ఐడెంటిటీ తెఫ్ట్ వంటి వాటికి గురవకుండా రక్షణ లభిస్తుంది.

నష్టాలు

- ★ రైట్ టు బి ఫర్గాటెన్ ఒక ప్రాథమిక హక్కుగా లభిస్తే, తరచూ మరికొన్ని చట్టబద్ధ/ ప్రాథమిక హక్కులైన సమాచార హక్కు, భావప్రకటన స్వేచ్ఛ, పరిశోధన, పాత్రికేయ స్వేచ్ఛలతో సంఘర్షణ ఏర్పడుతుంది.
- ★ సాంకేతికంగా డిజిటల్ సంస్థలకు ఎన్నో సవాళ్లు ఎదురవుతాయి. భారీఎత్తున సమాచారం నిరంతరం తొలగించాల్సిన పరిస్థితితో ప్రత్యేక యంత్రాంగం, సాంకేతికతల ఆవశ్యకత ఏర్పడుతుంది.
- ★ సెర్చ్ ఇంజన్లు ఇచ్చే సమాచారం విపరీతంగా కుంచించబడుతుంది. ఒక అంశంతో అనేక ఉప అంశాలు ముడిపడి ఉన్నప్పుడు వ్యక్తిగత స్వేచ్ఛ హక్కు కారణంగా అవి తొలగించాల్సి వస్తే సమాచారం అతుకుల బొంతగా తయారవుతుంది.
- ★ బ్లాక్‌చైన్ టెక్నాలజీ నేపథ్యంలో సమాచారాన్ని పూర్తిగా తొలగించడం, పునరావృతం కాకుండా చూడటం దుర్లభం.

ఇలాంటి వాదోపవాదాల/ లాభ-నష్టాల నేపథ్యంలో ప్రస్తుతం రైట్ టు బి ఫర్గాటెన్ అనేది ప్రాథమిక హక్కుల పరిధిలోకి వస్తుందా? ఒక హక్కుగా స్థిరీకరించి ప్రజలకు అందుతుందా అనే అంశాలతోపాటు ఇతర ప్రాథమిక హక్కుల పరిధిలోకి వెళ్లి సంఘర్షణ ఏర్పడినప్పుడు ఏమి చేయాలనే అంశాలు సుప్రీంకోర్టు పరిశీలనార్థం ఉన్న ఇండియన్ ఖానూన్ కేసు సముఖంగా తేలాల్సిందే.

నవ్య | చిత్రజ్యోతి

ఇన్ ప్రోగ్రెస్

విష్వక్ వినోదం



విష్వక్‌సేన్ హీరోగా నటించే 14వ చిత్రాన్ని బుధవారం ప్రకటించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. 'జాతిరత్నాలు' చిత్ర దర్శకుడు అనుదీప్ కేవీ ఈ సినిమాకు దర్శకుడు. హిలేరియస్ ఎంటర్‌టైనర్స్ అందించడంలో అనుదీప్‌కు మంచి పేరు ఉంది. అందుకే ఈసారి కూడా ఆయన విష్వక్‌సేన్‌తో నవ్వుల వర్షం సృష్టించనున్నారని నిర్మాత చెప్పారు. భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని, సురేశ్ సారంగం ఫొటోగ్రఫీని అందించనున్నారు. సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల.

థియేటర్లో చూడాల్సిన చిత్రం



నూతన నటులతో తీసిన చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'. యదు వంశీ దర్శకత్వంలో నిహారిక కొణిదెల నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోన్న సందర్భంగా దర్శకుడు యదు వంశీ మీడియాతో ముచ్చటించారు. "ఒక ఊరిలో జాతర చుట్టూ జరిగే కథ ఇది. ప్రతీ కుర్రాడు ఈ సినిమాకు రిలేట్ అవుతారు. స్నేహం, రాజకీయాల చుట్టూ తిరిగే ఈ సినిమా అందరినీ అలరిస్తుందనే నమ్మకం ఉంది. అన్ని రకాలుగా ఆకట్టుకునే అంశాలున్న ఈ సినిమాను థియేటర్లో చూస్తేనే బాగుంటుంది" అని చెప్పారు.

నిర్మాత శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి సతీవియోగం

ప్రముఖ నిర్మాత, మల్లెమాల ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత ఎం.శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి సతీమణి వరలక్ష్మి బుధవారం హైదరాబాద్‌లో కన్ను మూశారు. ఆవిడ వయసు 62 సంవత్సరాలు. క్యాన్సర్ వ్యాధి కారణంగా కన్ను మూసిన వరలక్ష్మి అంత్యక్రియలు గురువారం నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.



ఆ విషయంలో అమితాబ్ తర్వాత బాలకృష్ణే!

'తాతమ్మ కల' చిత్రంతో తెరంగేట్రం చేసిన నందమూరి బాలకృష్ణ నటుడిగా 50 ఏళ్ల పూర్తి చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 108 వ చిత్రం నిర్మాణంలో ఉంది. ఒక హీరోగా యాభై ఏళ్ల సినీ ప్రయాణం నిజంగా అరుదైన విషయమే. అందుకే బాలకృష్ణ స్వర్ణోత్సవ వేడుకలను సెప్టెంబర్ ఒకటిన తెలుగు చిత్ర పరిశ్రమ భారీ స్థాయిలో నిర్వహించనుంది. బుధవారం జరిగిన ఈ వేడుక సన్నాహక కార్యక్రమంలో నందమూరి మోహనకృష్ణ, రామకృష్ణ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మోహనకృష్ణ మాట్లాడుతూ 'మా తమ్ముడు నటుడిగా యాభై ఏళ్లు పూర్తి చేసుకోవడం చాలా గొప్ప విషయం. నాన్నగారికి వారసుడిగా పరిశ్రమలో నిలబడడమే కాకుండా ఎటువంటి పాత్రనైనా చేయగల నటుడిగా నిరూపించుకున్నారు' అన్నారు. 'ఇండియన్ సినిమా హిస్టరీలో అమితాబ్ బచ్చన్ తర్వాత సుదీర్ఘకాలం నటుడిగా ఉంటూ బాలకృష్ణ తన ప్రత్యేకత చాటుకున్నారు. ఇప్పటికీ కుర్ర హీరోలకు ఏ మాత్రం తగ్గకుండా పోటీ ఇస్తున్నారు. పరిశ్రమ అంతా కలసి చేస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి' అని కోరారు తమ్మారెడ్డి భరద్వాజ. నిర్మాతలమండలి కార్యదర్శి తుమ్మల ప్రసన్నకుమార్ మాట్లాడుతూ 'ఈ వేడుక నిర్వహించడానికి మొదట బాలకృష్ణ ఒప్పుకోలేదు. కానీ ఇదొక స్ఫూర్తిదాయక కార్యక్రమంగా ఉంటుందని వివరించడంతో ఆయన అంగీకరించారు' అన్నారు.

రూ.రెండు కోట్ల విరాళం



కేరళలో వయనాడ్ జిల్లాలో కొండ చరియలు విరిగిపడ్డంతో జరిగిన విషాదం అందరికీ తెలిసిందే. ఈ విపత్తు బారిన పడిన బాధితులకు ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులు విరాళాలు అందించి తమ వంతు సాయం చేశారు. బుధవారం ప్రభాస్ కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.రెండు కోట్ల విరాళం అందించి తన గొప్ప మనసును చాటుకున్నారు. ఇప్పటికే ఈ విపత్తు బారిన పడిన వారి కోసం తెలుగు ఇండస్ట్రీ నుంచి చిరంజీవి, రామ్‌చరణ్ సంయుక్తంగా రూ.కోటి.. అల్లు అర్జున్ రూ.25 లక్షలు అందజేశారు.

సంపదను కాపాడేవాడూ సైనికుడే



'సరిహద్దును కాపాడేవాడే సైనికుడు కాదు... సంపదను కాపాడేవాడూ సైనికుడే' అంటున్నారు రవితేజ. ఆయన కథానాయకుడిగా నటించిన 'మిస్టర్ బచ్చన్' చిత్రంలోనిది ఈ డైలాగ్. హరీశ్ శంకర్ దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఆగస్టు 15న విడుదలవుతోంది. 'మిస్టర్ బచ్చన్' చిత్రం థియేట్రికల్ ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని యూనిట్ బుధవారం నిర్వహించింది. హరీశ్ శంకర్ మాట్లాడుతూ 'అమితాబ్‌బచ్చన్ గారి 'షోలే' చిత్రం విడుదలైన ఆగస్టు 15న మా సినిమా కూడా విడుదలవడం కాకతాళీయమే. ఈ సినిమాకు 'మిస్టర్ బచ్చన్' టైటిల్‌ను రవితేజ గారు నిర్ణయించారు' అని చెప్పారు.

నీ వెంటే మేమంతా

వినేశ్ ఫొగాట్‌కు సినీతారల మద్దతు



పారిస్ ఒలింపిక్స్‌లో ఫైనల్‌కు చేరిన భారత కుస్తీ క్రీడాకారిణి వినేశ్ ఫొగాట్ పతకం సాధించి మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించడం ఖాయమని భావించిన తరుణంలో ఆమె అనూహ్య నిష్క్రమణ దేశవ్యాప్తంగా క్రీడాభిమానులను నిరాశకు గురిచేసింది. వంద గ్రాముల బరువు పెరిగారనే కారణంతో ఒలింపిక్ కమిటీ, రెజ్లింగ్ కమిటీ ఆమెపై అనర్హత వేటు వేయడం సగటు అభిమానితో పాటు సెలబ్రిటీలను కలచివేసింది. దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు వినేశ్‌కు మద్దతుగా నిలిచారు. ఈ క్రమంలో పలువురు సినీ తారలు సైతం సోషల్ మీడియా ద్వారా వినేశ్‌కు ధైర్య వచనాలు చెప్పారు.

- పతకం గెలిచినా, గెలవకపోయినా మీరు నిజమైన ఛాంపియన్ అని అందరికి చూపించారు. ఫలితాన్ని మీరు స్వీకరించిన తీరు, కష్ట సమయంలో మీరు చూపిన నిబ్బరం మా అందరికీ స్ఫూర్తిదాయకం. మీ స్ఫూర్తి మాలోని ప్రతి ఒక్కరిలో ప్రకాశిస్తోంది. 140 కోట్ల హృదయాలు మీతో ఉన్నాయి.
  - మహేశ్ బాబు
- ఎంత పోరాట పటిమ కనబరిచేవారైనా కొన్నిసార్లు కఠినమైన అడ్డంకులను ఎదుర్కోవాల్సి వస్తుంది. మీరు ఒంటరి కాదు. కష్టసుఖాల్లో మేమంతా మీ వెన్నంటే ఉంటాం. ప్రతికూల పరిస్థితులకు ఎదురొడ్డి నిలబడిన మీ తీరు ప్రశంసనీయం
  - సమంత
- విజయమనే తూనికలో ఇమిడే ప్రతిభ కాదు నీది. నీ ఆటతీరుతో ఎంతోమందిని ప్రభావితం చేశావు. మా మనసుల్లో గొప్ప స్థానం పొందావు. మా అందరి ప్రేమాభిమానాలు నీతోనే ఉంటాయి. గర్వంగా తలెత్తుకొని నిలబడు.
  - నయనతార
- జాతి యావత్తుకు మీరు స్ఫూర్తిగా నిలిచారు. యోధురాలుగా కొన్ని తరాలు మిమ్మల్ని గుర్తుంచుకుంటాయి. ఇలాంటి అడ్డంకులు ఎన్ని వచ్చినా చరిత్ర సృష్టించకుండా మిమ్మల్ని ఆపలేదు. పట్టుదలను, ధైర్యాన్ని, కష్టాన్ని మీ నుంచి దూరం చేయలేవు. మీలాంటి వారు మరొకరు లేరు.
  - అలియాభట్
- వినేశ్ నిష్క్రమణ నిరాశ కలిగించింది. ఆమె మనందరి హృదయాలను గెలుచుకున్నారు.
  - తాప్సీ
- వినేశ్ నువ్వో యోధురాలివి. నిన్ను చూసి గర్విస్తున్నా. నువ్వు సాధించింది పతకాల కంటే ఎక్కువ
  - దర్శకురాలు జోయా అక్తర్
- మీరెప్పుడూ ఛాంపియనే
  - సోనాక్షిసిన్హా



వినేశ్ ఫొగాట్‌పై అనర్హత వేటు నేపథ్యంలో నటి, బీజేపీ ఎంపీ హేమమాలిని చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. 'వంద గ్రాముల బరువు పెరిగారనే కారణంతో వినేశ్ అనర్హతకు గురవడం ఆశ్చర్యపరిచింది. క్రీడాకారులు, కళాకారులు తమ బరువును అదుపులో ఉంచుకోవడం ఎంత ముఖ్యమో ఈ సందర్భంగా మనం అర్థం చేసుకోవాలి. ఇది మనందరికీ ఒక పాఠం. ఆమె బరువు తగ్గొచ్చు కానీ పోయినా అవకాశం అయితే మళ్లీ రాదుకదా' అని వ్యాఖ్యానించారు హేమమాలిని. ఒక ప్రజా ప్రతినిధి అయి ఉండి, కష్టకాలంలో క్రీడాకారిణిగా ధైర్యం చెప్పాల్సింది పోయి ఇలా కామెంట్ చేయడం తగదని నెటిజన్లు హితవు పలికారు. అనర్హత అంశం గురించి హేమమాలిని మీడియాతో నవ్వుతూ మాట్లాడారని తప్పుపట్టారు.

సమాజానికి ఉపయోగపడే సినిమాలే చేస్తా



దర్శకుడు సంపత్ నంది, దాసరి రాజేందర్ రెడ్డి సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'సింబా'. మురళి మనోహర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో జగపతిబాబు, అనసూయ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్ర నిర్మాతల్లో ఒకరైన రాజేందర్ రెడ్డి మీడియాతో ముచ్చటించారు. 'సంపత్ నంది సమాజానికి ఉపయోగపడేలా ఏదైనా చేద్దాం అనే ఉద్దేశంతో ఈ కథ రాసి నా దగ్గరికి వచ్చారు. ప్రకృతి మీద ప్రేమను పెంచేలా.. పర్యావరణ పరిరక్షణపై అవగాహనను కల్పించేలా ఉంటుందీ చిత్రం. జగపతి బాబు, అనసూయ నటన సినిమాకే హైలైట్. ఆగస్టు 9 అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవం కాబట్టి అదే రోజున సినిమాను విడుదల చేస్తున్నాం. ఇకపై నేను చేసే ప్రతీ సినిమాలో ప్రజలకు ఉపయోగపడే అంశాలు ఉంటాయి" అని చెప్పారు.

ప్రొడ్యూసర్ టాక్

విజయదశమికి 'కార్తికేయ 3'ను ప్రకటిస్తాం



'కార్తికేయ', 'సుబ్రమణ్యపురం', 'కథలో రాజకుమారి' చిత్రాలతో మంచి అభిరుచి ఉన్న నిర్మాతగా పేరు తెచ్చుకున్నారు వెంకట శ్రీనివాస్ బొగ్గరం. ఆయన ఇటీవలే మీడియాతో ముచ్చటించి.. అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'కార్తికేయ 3' సినిమా గురించి ఓ ఆసక్తికర అప్‌డేట్‌ను అందించారు.

"కార్తికేయ' మొదటి భాగం విడుదలై పదేళ్లు అవుతున్న సందర్భంగా అక్టోబరులో విజయదశమి రోజున 'కార్తికేయ 3' సినిమాను అధికారికంగా ప్రకటించనున్నాము. ఆ రోజే సినిమా గురించి మరిన్ని వివరాలు వెల్లడిస్తాము. 'కార్తికేయ 2' సంచలన విజయం సాధించడంతో మూడో భాగంపై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. అందరి అంచనాలు నిలబెట్టుకోవడానికి స్క్రిప్ట్ విషయంలో చాలా జాగ్రత్తలు పాటిస్తున్నాం. డివోషనల్ టచ్ ఉండేలా హనుమంతుడి స్ఫూర్తితో 'యతి' అనే సినిమాను.. శివుడి స్ఫూర్తితో 'మహాయోగి' అనే మరో సినిమాను నిర్మిస్తున్నాను" అని చెప్పారు.

నిర్వహణ లేక.. వినియోగంలో లేక

- శిథిలావస్థకు చేరిన నిర్మాణాలు
- అటకెక్కిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు



అరసాడలో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రం

వంగర: మండలంలోని చెత్త సంపద కేంద్రాల నిర్వహణ అటకెక్కింది. చెత్త నుంచి సంపద తయారీ చేయాలన్న లక్ష్యం నీరుగారుతోంది. పంచాయతీలకు ఆర్థిక వనరులు సమకూర్చడానికి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్న ఉదేశం లో గతంలో అప్పటి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా చెత్తసంపద కేంద్రాలు నిర్మించింది. వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం పుణ్యమాని ఈ కేంద్రాలు వినియోగంలో లేకుండాపోయాయి. ఇళ్ల నుంచి సేకరించిన తడిపొడి చెత్తను వేరు చేసి దాని ద్వారా ఎరువులు తయారీ చేయాలని నిర్ణయించినా వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్న ఆరోపణలొస్తున్నాయి. దీంతో మందుబాబులు, పేకాటరాయళ్లకు అడ్డాగా మారాయి. కొన్ని సంపద కేంద్రాల గోడలు బీటలు వారాయి. మరికొన్ని పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి.ఈ నేపథ్యంలో చెత్త సంపద కేంద్రాలు వినియోగంలో లేకపో వడంతో గ్రామాల్లో సేకరించిన చెత్తను రోడ్లపై వేసి కాల్చాల్సివస్తోంది. చెత్త సంపద కేంద్రాల నుంచి ఫలితాల సాధనలో గత వైసీపీ ప్రభుత్వం విఫల మయ్యిందన్న ఆరోపణ లొస్తున్నాయి.ఈ కేంద్రాలు నిర్మించిన పంచాయతీల్లో 1000 మంది జనాభాకు ఒక హరిత రాయ బారిని కూడా ప్రభుత్వం నియమించింది ప్రభుత్వం ఇళ్ల నుంచి చెత్త సేకరణకు ప్లాస్టిక్ డబ్బాలు, మూడు చక్రాలు బండ్లు సైతం సమకూర్చింది. నిర్మించిన తొట్టెల్లో తడి పొడి చెత్త వేసి వాటిల్లో వానపాములు వేసి కంపోస్టు ఎరువుల తయారుచేసి రాయితీపై రైతులకు అందించాల్సిఉంది. అయితే గత ప్రభుత్వం వైఖరి వల్ల ప్రభుత్వ లక్ష్యం నీరుగారింది. కాగా ఇప్పటికే వంగర, అరసాడ, బాగెమ్మపేటతో పాటు పలు గ్రామాల్లో నిర్మించిన చెత్తసంపద కేంద్రాలు నిరుపయోగంగా ఉండడం వాస్తవమేనని ఎంపీడీవో సల్మాన్‌రాజ్ తెలిపారు. వాటిని వినియోగంలోకి తీసుకురావడానికి అనుమతులొచ్చాయని చెప్పారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

శృంగవరపుకోట: శృంగవరపుకోట పందిరప్పన్న కూడలిలో ఓ యువకుడు విద్యుదాఘాతంతో మృతిచెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు,స్థానికుల కథనంమేరకు.. ఎస్.కోట జగనన్నకాలనీలో దార్ల సతీష్ (31)కుటుంబం నివసి స్తోంది. ఆయనవెల్డింగ్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఏడాది కిందట రజినితో వివాహంజరిగింది.బుధవారం స్థానిక పందిరప్పన్న కూడలిలో ఓ ఇంట్లో వెల్డింగ్ పనులు చేసేందుకు తమ్ముడు శంకర్‌తో కలిసి వెళ్లాడు. ఉదయం 10.30గంటల సమయంలో మొదటి అంతస్థులో వెల్డింగ్ చేసేందుకు రాడ్‌ను కిందనుంచి తమ్ముడు శంకరరావు సహకారంతో పైకిఎత్తాడు. రాడ్‌పైకి లేపే క్రమం లో పైనున్న విద్యుత్ వైర్లకు రాడ్ తగిలింది. దీంతో దార్ల సతీష్ విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఆయన తమ్ముడు అప్పటికే రాడ్‌ను విడిచిపెట్టడంతో ప్రాణాపాయం తప్పింది. సతీష్ కిందపడే క్రమంలో ఆయన వెనుక ఉన్న ఇంటి యజమాని కొండలరావు వెనక్కిపడడంతో గాయపడ్డాడు. సతీష్ మృతిచెందిన విషయం తెలుసుకున్న భార్య రజిని సంఘటన స్థలానికి చేరుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించేందుకు పోలీసులు ప్రయత్నించారు. తనకు న్యాయం చేసే వరకూ మృత దేహాన్ని తరలించవద్దని ఆమె కోరింది. పోలీసులు నచ్చజెప్పి పోస్టుమార్టంకోసం ప్రాంతీయ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. ఈ మేరకు కేసు నమోదుచేశారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



తెర్లాం: మండలంలోని ఆమిటి నుంచి బలిజిపేట వెళ్లే ప్రధాన రహదారి పక్కన గ్రామానికి ఆనుకొని ఉన్న ఊట బంద గట్టుపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ ఆర్.రమేష్ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 70 నుంచి 75 సంవత్సరాలు ఉంటుందని, మృతుడు నీలం రంగు షార్టు వేసుకొని ఉన్నాడని చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు తెర్లాం పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని బాడంగి సీహెచ్‌సీకి తరలించినట్లు తెలిపారు.

ఏడుగురు ఆకతాయిలపై కేసు

గరివిడి: ఈనెల 6వ తేదీన అర్ధరాత్రి వెళ్తున్న ఓ ఆటోను ఆపి డబ్బులు అడగడంతో పాటు ఆటోలో ఉన్న మహిళాపై అనుచితంగా ప్రవర్తించిన ఏడుగురు ఆకతాయిలపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామని గరివిడి ఎస్ఐ ఎల్.దామోదరరావు తెలిపారు. అయన బుధవారం రాత్రి స్థానిక విలేకర్లకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెరకముడిదాం మండలం గరుగుబిల్లి గ్రామానికి చెందిన గుడివాడ సోంబాబు అనే ఆటోడ్రైవర్ ఈనెల 6న తన గ్రామానికి చెందిన కొంతమంది ప్రయాణికులను తిరుపతి వెళ్లడానికి అర్ధరాత్రి సమయంలో విజయనగరం రైల్వేస్టేషన్‌కు తీసుకువెళ్తున్నాడు. ఆటో గరివిడి మండలం కాపుశంభాం సెంటర్ వద్దకు వచ్చేసరికి, మద్యం మత్తులో ఉన్న ఏడు గురు యువకులు ఆ ఆటోను ఆపారు. డబ్బులు ఇవ్వాలని దౌర్జన్యం చేశారు. దీం తో భయపడిన ఆటోడ్రైవర్ సోంబాబు చీపురుపల్లి వైపు తన ఆటోను నడప సాగాడు. కానీ బరితెగించిన ఆకతాయిలు కారుతోనూ, ద్విచక్ర వాహనంతోనూ ఆటోను వెంబడించి బీజేపాలెం సమీపంలో ఆటోను నిలుపుదల చేయించారు. ఆటో డ్రైవర్ సోంబాబుపై దౌర్జన్యం చేయడంతో పాటు, ఆటోలో ఉన్న మహిళా ప్రయాణికులపై అసభ్యంగా ప్రవర్తించారు. స్థానికులు అక్కడికి రావడంతో ఆకతాయిలు ఉడాయించారు. ఆటోడ్రైవర్ 100కు ఫిర్యాదు చేయడంతో గరివిడి ఎస్ఐ ఎల్.దామోదరరావు కేసు నమోదు చేసి, నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో ఐదుగురు యువకులు గరివిడి మండలం, ఇద్దరు యువకులు చీపురుపల్లి మండలానికి చెందినవారు.

గంజాయి స్వాధీనం?

సాలూరు రూరల్:బొలేరో వ్యాను టాప్‌లో తరలిస్తున్న గంజాయిని సాలూరు రూరల్ ఎస్ఐ ఎం.వెంకటరమణ పట్టుకున్నట్టు తెలిసింది. నిందితుడు ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం. ఒడిశాలో పాడువా ప్రాంతం నుంచి పాచిపెంటమండలం మాతుమూరు మీదుగా మక్కువ మండలానికి ఆనుకుని ఉన్న ఒడిశాలో నారాయణపట్నం రహదారికి వెళ్తున్న వాహనంలో గంజాయి ఉందనే సమాచారం పోలీసులకు అందినట్టు తెలిసింది. ఈ వాహనం బాగువలస వైపు వెళ్తుతుండగా సాలూరురూరల్ ఎస్ఐ వెంకటరమణ, సిబ్బంది వెంటబడి పట్టుకున్నారు. వాహనం తనిఖీ చేయగా ఏమి కనిపించలేదు. వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించగా టాప్‌లో దాచిన 80 కిలోల గంజాయి దొరికినట్లు సమాచారం. పోలీసులు ఇప్పటివరకు ఎటువంటి ప్రకటన చేయలేదు.

● **భోగాపురం:** భోగాపురంలో బుధవారం గంజాయి కలకలం రేగింది. భోగాపురం పెద్ద వీధికి చెందిన ఓ వ్యక్తి వద్ద కొంత గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. అలాగే గంజాయితో లింకు ఉన్న గ్రామానికి చెందిన మరో ముగ్గురిని, రావాడకు చెందిన మరో వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.దీనిపై సీఐ రవికుమార్‌ను వివరణ కోరగా గంజాయికి సంబంధించి ఐదుగురిని విచారిసున్నామని, పూర్తి నివేదిక అందజేస్తామని తెలిపారు.

అదుపు తప్పి.. ఆటోను ఢీకొనబోయి..



ఆటో ఢీకొనబోయిన ద్విచక్రవాహనం

బాడంగి: ఎరుకులపాకలలో ఉన్న పాఠశాలను గజరాయనివలసకు మార్చడంతో రోజూ పిల్లలు కిలోమీటరు నడుచుకుంటూ భయం గుప్పెట్లో వెళ్తున్నారు.బుధవారం వర్షం పడుతుండడంతో పిల్లలను ద్విచక్రవాహనంపై తీసుకువస్తున్న సమయంలో ఈ ప్రాంతంలోని మలుపు వద్ద వాహనం అదుపుతప్పి ఆటోను ఢీకొనబోయింది. ఆటోడ్రైవర్ చాకచక్యంతో పక్కకు తీయడంతో ప్రమాదం తప్పింది. ఇప్పటికైనా 3, 4, 5 తరగతులను ఎరుకులపాకలులో నిర్వహించాలని ఎంపీటీసీ గౌరు, స్థానికులు కోరారు.

రోడ్డు భద్రత కోసం సైకిల్‌యాత్ర



రేగిడి: సుప్రియదాస్‌కు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రేగిడి:పశ్చిమబెంగాల్‌లోని ఈస్టమిడ్నాపూర్ ప్రాంతానికి చెందిన యువకుడు సుప్రియా దాస్ మొక్కలు పెంచడం, రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేపట్టిన సైకిల్‌యాత్ర బుధవారం సంకిలి చేరింది. ఈ సందర్భంగా సంకిలి ఉన్నతపాఠశాల హెచ్ఎం రామినాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు తన యాత్ర వివరాలు వివరించాడు. జూలై 12 నుంచి దక్షిణ భారతదేశంలో 13 వేల కిలోమీటర్లు యాత్ర చేపట్టానని, ప్రస్తుతం బెంగాల్ నుంచి ఒడిశా మీదుగా ఇక్కడకు వచ్చానని, సాలూరు కొరాపుట్ వెళ్తున్నట్లు చెప్పారు.

●**రాజాం:** రాజాం ప్రభుత్వోన్నత పాఠశాల వద్ద ఉపాధ్యాయులు ,విద్యార్థులు, గ్రీన్‌బెల్ట్ కన్వీనర్ ఆర్‌వీజేనాయుడు పెంకి చైతన్యకుమార్ సైకిల్ యాత్రీకుడు సుప్రియదాస్‌కు స్వాగతం పలికారు. బొబ్బిలి రోడ్డులో కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, తారక్, వేగిరెడ్డి సుబ్బారావులు స్వాగతం పలికారు. సుప్రియ దాస్‌కు ఆతిథ్యం ఇవ్వడమే కాకుండా ఆయన ఆర్థికసాయం అందజేశారు.

నవదుర్గ ఆలయ ఈవో సస్పెన్షన్

రాజాం రూరల్: రాజాంలోని నవదుర్గ అమ్మవారి ఆలయం ఈవో కేశవరావును సస్పెండ్‌చేస్తూ దేవదాయశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులుజారీ చేశారు. ఆయనస్థానంలో విజయనగరం డివిజన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మిని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. రాజాంలోని నవదుర్గ అమ్మవారి ఆలయంతో పాటు వంగర మండలం సంగాం సంగమేశ్వరాలయం ఈవోగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే కేశవరావు పనితీరు, వ్యవహార శైలిపై ఫిర్యాదు అందడంతోపాటు రికార్డుల నిర్వహణ, సిబ్బంది జీతాలచెల్లింపులో అవకతవకలు జరిగిన నేపథ్యంలో ఈనెల 3న దేవదాయశాఖ ఉప కమిషనర్ సుజాత, జిల్లా సహాయ కమిషనర్ అన్నపూర్ణ విచారణ నిర్వహించారు.నివేదికను కమిషనర్‌కు అందజేయగా, ఈవో కేశవరావును సస్పెండ్‌చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. సస్పెన్షన్ ఉత్తర్వులు తీసుకునేందుకు ఈఓ అందుబాటులో లేకపోవడంతో ఆలయ గోడలపై అతికించారు.

అన్నక్యాంటీన్ల ప్రారంభానికి ఏర్పాట్లు చేయండి

- విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు



అన్న క్యాంటీన్‌లో పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్: ప్రభుత్వం అన్నక్యాంటీన్లను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తెలిపారు. ఈ నెల 15న ప్రారంభోత్సవానికి పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే విజయనగరంలోని అన్నక్యాంటీన్ల పనులనునగరపాలక సంస్థ అధికారులతో కలిసి పరిశీలించారు. ఘోషాసుపత్రి వద్ద అన్నక్యాంటీన్ పనులు పూర్తికావడానికి 20 నుంచి 25 రోజులు పట్టే అవకాశముందని, నగరపాలక సంస్థ కార్యాలయం, ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుటఉన్న అన్న క్యాంటీన్ల పనులు శతశాతం పూర్తయ్యాయని అధికారులు వివరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేదలకు పట్టెడన్నం పెట్టడమే అన్న క్యాంటీన్ల లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు, ఈఈ శ్రీనివాసరావుతో పాటు, తహసీల్దార్ ఎస్.కూర్మానాథరావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

●విజయనగరంలోని దేవి పార్కును ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సందర్శిం చారు. అక్కడ యోగా తరగతులు పరిశీలించారు.పార్కు ఆవరణలో మొక్కలు నాటారు.

అన్నక్యాంటీన్లకు విరాళం

దాసన్నపేట:జిల్లాకేంద్రంలోని అన్నక్యాంటీన్‌కు విజయనగరం కాకతీయ కల్చరల్ అసోసియేషన్ రూ.రెండు లక్షల విరాళం ప్రకటించింది. బుధవారం ఎమ్మెల్యే అదితి చేతులు మీదుగా కలెక్టర్ అంబేడ్కర్‌కు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోయేషయన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయ బీచ్ కబడ్డీ పోటీలకు ఇద్దరి ఎంపిక



భువన, సూర్యకళ

విజయనగరం టౌన్: జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఈనెల 9 నుంచి 12వ తేదీ బీహార్‌లోని బుద్ధగయ జరగనున్న జాతీయ బీచ్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల రెండో తేదీ నుంచి నెల్లూరు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఎం.భువన, వి.సూర్యకళలను జాతీయపోటీలకు ఎంపిక చేసినట్లు కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రంగారావుదొర, కేవీ ప్రభావతి తెలిపారు. భువనను రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా ఎంపికచేశారని పేర్కొన్నారు. ఈమేరకు భువన, సూర్యకళలను ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపేన లక్ష్మణరావు, ట్రెజరర్ ఈశ్వరరావు, కబడ్డీ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

భవన నిర్మాణానికి అనుమతులు తప్పనిసరి

రింగురోడ్డు: నగరంలో భవనాల నిర్మాణానికి అనుమతులు తప్పనిసరని నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.ఎం.నాయుడు అన్నారు. బుధవారం 26వ డివిజన్ కోరాడవీధి, ఎలుగుబంటివారి వీధి, తదితర ప్రాంతాల్లో పర్యటించారు. నిర్మాణంలో ఉన్న భవనాలకు అనుమతులు ఉన్నాయా.. లేవని సంబంధిత కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు.ఖాళీ స్థలాలకు పన్ను విధించడం లేదని తెలుసుకున్నారు. ఖాళీ స్థలాల్లో చెత్తా చెదారాలను ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి సూచించారు.ఆయన వెంట వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వంద రోజులు పనికల్పించాలి: పీడీ

కొత్తవలస: ప్రతి ఉపాధిహామీ వేతనదారుడుకు 300 రూపాయలు వేతనం లభించడంతోపాటు 100 రోజులు పని కల్పించే విధంగా ఏపీవోలు చర్యలు తీసుకోవాలని డుమా పీడీ జి.ఉమాపరమేశ్వరి కోరారు. బుధవారం కొత్తవలస ఎంపీడీవో కార్యాలయంలో శృంగవరపుకోట నియోజకవర్గం పరిధిలో గల ఐదు మండలాలకు చెందిన ఐదుమండలాల ఏపీవోలు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. ఉపాధిపనులు కాలానుగుణంగా చేయాలని తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో పండ్లతోటలు పెంపకంతో పాటు ఫారంపాండ్లు నిర్మించాలని చెప్పారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టండి

- బొబ్బిలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి మోహనరావు



బాడంగి: రికార్డులను పరిశీలిస్తున్న మోహనరావు

బాడంగి: మెనూ ప్రకారం వంటలు నిర్వహించి, నాణ్యమైన భోజనం పెట్టాలని బొబ్బిలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి కె.మోహనరావు కోరారు. బుధవారం బాడంగి జడ్పీ ఉన్నతపాఠశాలను తనిఖీ చేశారు. ఇక్కడ గురువారం జరగనున్న ఎస్ఎంసీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్చించారు.ఓటర్ల జాబితాను పరిశీలించారు. రికార్డులు సక్రమంగా ఉండాలని, 3, 6, 10 తరగతుల విద్యార్థుల నోట్, వర్క్ బుక్స్ పరిశీలించి విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. ఉపాధ్యాయులు లెసన్ ప్లాన్, డైరీ రాస్తూ వెనుకబడిన విద్యార్థులకు రెమిడియల్ విద్య అందివ్వాలని కోరారు. ఆయన వెంట ఇన్‌చార్జి హెచ్ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు ఈశ్వరరావు, సత్యనారాయణ, రమేష్, రామారావు, త్రినాథ, శ్రీనివాస్ ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించండి

బొబ్బిలి రూరల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో సీహెచ్ లక్ష్మణరావు కోరారు. రంగరాయపురం ఎంపీపీఎస్ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శతశాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

టాయిలెట్ల ఫొటోలు రద్దుచేయడంపై హర్షం

రాజాం:ప్రతిరోజూ టాయిలెట్ల ఫొటోలు తీసి పంపించాలన్న నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వం రద్దుచేయడంపై ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పల రమేష్, బలివాడ నాగశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం రాజాంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రక్రియ ఉపాధ్యాయుల ఆత్మగౌరవం దెబ్బతీసే విధంగా ఉందని, గత ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించుకున్నా మొండివైఖరి అవలంబించిందని తెలిపారు.సరిగా పని చేయని యాప్‌లతో కుస్తీలు పట్టేవారమని ఆ ఫొటోలు అప్‌లోడ్ చేయకపోతే మెమోలు పంపేవారని తెలిపారు. పాఠశాలల్లో ఫోటోలు తీసే యాప్‌లో అప్లోడ్ చేసే హింస నుంచి ఉపాధ్యాయ వర్గానికి విముక్తి కలిగిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ట్విట్టర్ వేదికగా ప్రకటించడంపై అభినందించారు.

ప్రధానికి పీవీజీ రాజు జీవిత చరిత్ర పుస్తకం

విజయనగరం రూరల్: విద్యాదాత పీవీజీ రాజు శతజయంత్యుత్సవాలను పురస్కరించుకుని ఆయన జీవిత చరిత్రను తెలిపే పుస్తకాన్ని (ఇంగ్లీషు వెర్షన్) ప్రధానిమోదీకి ఎంపీ కలిశెట్టిఅప్పలనాయుడు బుధవారం ఢిల్లీలో అందజేశారు. పీవీజీరాజు జీవిత చరిత్రపై ముద్రించిన తెలుగు వెర్షన్‌ను ఇంగ్లీషులోకి తర్జుమా చేయించి దిలాస్ట్ మహారాజా ఆఫ్ విజయనగరం పేరుతో ముద్రించారు.

సైబర్‌నేరాల నియంత్రణకు చర్యలు

విజయనగరం క్రైం: శాంతిభద్రతల పరిక్షణకు కృషి చేస్తానని సీఐ ఎస్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం విజయనగరం వన్‌టౌన్ సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్‌నేరాలు, గంజాయి అక్రమ రవాణా, దొంగతనాల నియంత్రణపై ప్రత్యేక చర్యలు చేపడతానని చెప్పారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి: వీసీ

విజయనగరం రూరల్: మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం ఉపకులపతి డి.రాజ్యలక్ష్మి పిలుపునిచ్చారు. కళాశాల ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ జీవీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, ఆచార్యులు ఆర్.రాజేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త వి.మణికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

టోల్‌గేట్లను రద్దు చేయాలి

విజయనగరం దాసన్నపేట: రాష్ట్ర రహదారులపై టోల్‌గేట్ ఛార్జీలతో వాహనదారులపై అధిక భారాలు మోపే ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కన్వీనరు ఎ.జగన్మోహన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విజయనగరంలోని జొన్నాడ, రామవరం, మానాపురం వద్ద ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌లను రద్దు చేయాలని పోరాటం చేస్తామన్నారు

ఎస్పీని కలిసిన సీఐలు

విజయనగరం క్రైం: ఇటీవల బాధ్యతలు చేపట్టిన ట్రాఫిక్ సీఐ సీహెచ్ సూరినాయుడు, రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర, వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాసరావు, కొత్తవలస సీఐ సీహెచ్ షన్ముఖరావు ఎస్పీ వకుల్ జిందాల్‌ను బుధవారం కలిశారు. శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలపై వారికి ఎస్పీ దిశా నిర్దేశం చేశారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

బొబ్బిలి: పాత బొబ్బిలి జంక్షన్ వద్ద డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చెక్ పోస్ట్ ఏర్పాటు చేశారు. ఒడిశా నుంచి వచ్చే వాహనాలను సీఐ నాగేశ్వరరావు తన సిబ్బందితో బుధవారం చెక్ చేశారు. మాదక ద్రవ్యాలు, గంజాయి, నాటుసారా, డ్రగ్స్ మత్తు పానీయాలు అక్రమ మార్గాల్లో తరలించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ తనిఖీలలో టౌన్ ఎస్ఐ లోవరాజు, ఏఎస్ఐ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



గొల్లపేట గ్రామస్థులతో మాట్లాడుతున్న అధికారులు

రాజాం: గొల్లపేటలోని బుచ్చమ్మచెరువు ఆక్రమణలను తహసీల్దారు ఎస్.కృష్ణంరాజు, సర్వేయర్ గోవిందరావు, వీఆర్వో సాయికుమార్ ఆధ్వర్యంలో బుధవారం తొలగించారు. సర్వేనెంబరు 33లో ఏడెకరాల విస్తీర్ణం గల చెరువులో అక్రమ నిర్మాణాలు జరిగాయని గ్రామానికి చెం దిన గౌరినాయుడు, పి.ఈశ్వరరావు, రాములు, జోగులు తదితరులు కలెక్టర్ స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో తహసీల్దార్ స్పందించి ఆక్రమణలను తొలగించడానికి సిబ్బందిని వెంటబెట్టుకొని వెళ్లారు. దీంతో గ్రామ పెద్దలు స్పందించి.. స్వచ్ఛందంగా తామే తొలగించి సమాచారం అందిస్తామని చెప్పడంతో తహసీల్దార్ వెనుదిరిగారు. గ్రామ పెద్దల సహకారంతో గ్రామస్తులు బుధవారం ఆక్రమణలను తొలగించారు.

చెరువు కబ్జాకు యత్నం

సుమారు ఏడెకరాల విస్తీర్ణం గల బుచ్చెమ్మ చెరువును కబ్జా చేయడానికి కొందరు ప్రయత్నించారు. అందుకు ఆయకట్టు రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆక్రమణదారులు తొలగించడానికి ముందుగా నిరాకరించడంతో స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ విషయంపై స్పందించిన తహసీల్దార్ ఆక్రమణలను తొలగించడానికి చర్యలు చేపట్టారు. చెరువులు ఎక్కడ ఆక్రమణలకు గురైనా బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ఎస్.కృష్ణంరాజు హెచ్చరించారు.

అంచనాలు తయారుచేయండి

బొబ్బిలి: స్థానిక మునిసిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి బుధవారం అమ్మిగారి కోనేరు గట్టు రోడ్, ఓంకార్ థియేటర్ రోడ్, మేదర బంద జంక్షన్‌లో పర్యటించారు. అమ్మిగారి కోనేరుగట్టు రోడ్డులో తాత్కాలికమరమ్మతులు చేపట్టి... కాలువలు నిర్మించడానికి అంచనాలు తయారు చేయవలసిందిగా ఏఈని ఆదేశించారు. మేదరబంద వద్ద కాలువలో సిల్టు తొలగించి నీరు పారే విధంగా చూడాలన్నారు.

బొబ్బిలిలో బ్యాడ్మింటన్ పోటీలు

బొబ్బిలి: బొబ్బిలి సంస్థానం ఉన్నతపాఠశాలలో రాజా ఆర్‌వీజీకే రంగారావు బహదూర్ జయంతి పురస్కరించుకుని ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీని బుధవారం ప్రారంభించారు.రెండురోజులపాటు జరిగే పోటీల్లో ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలకు చెందిన12 నుంచి 15 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

రేగిడి: పుర్లిలో అనధికారంగా డంప్ చేసిన ఇసుక నిల్వలను తరలిస్తుండగా గోపంపేట వద్ద బుధవారం ట్రాక్టర్ సీజ్‌చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఇసుక అక్రమరవాణాపై తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

మరుగుదొడ్లు వినియోగించుకోవాలి

బొబ్బిలి రూరల్: ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వినియోగించుకోవాలని ఎంపీడీవో రవి కుమార్ కోరారు. బుధవారం మండలంలోని పారాదిలో ఓడీఎఫ్ ప్లస్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన లేని గ్రామంగా చేసేందుకు సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. మరుగు దొడ్లు నిర్మించినా కొన్ని ఇళ్లలో వినియోగించకపోవడం పై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ, జేఈఈ పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డు నిర్మించవద్దు

- కొత్తవలసలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న డేగల అప్పలరాజు

కొత్తవలస: ఎన్‌హెచ్-516(బి)కు సంబంధించి బైపాస్ రోడ్డు నిర్మించ వద్దని ఏపీ రైతు సంఘం జిల్లా సమితి కార్యదర్శి డేగల అప్పలరాజు ఆధ్వర్యంలో వీరభద్రపురం, నరపాం, మిందివలస రామచంద్రపురం, నిమ్మలపాలెం గ్రామాలకు చెందిన రైతులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ జిల్లా పెందుర్తి నుంచి అరకు వరకు ఎన్‌హెచ్-516(బి) అభివృద్ధిలో భాగాంగా బైపాస్ రోడ్డు నిర్మాణంతో తాము పంట భూములు నష్టపో తామని ఆందోళన వ్యక్తంచేశారు. బైపాస్ రోడ్డును నిలిపివేసి పాత రోడ్డునే అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. పెందుర్తి నుంచి అరకు వరకు 80 అడుగులుగా రహదారిని అభివృద్ధిచేయాలని, లేకపోతే బైపాస్ వల్ల ఇళ్లు కోల్పోయినవారికి, ఇళ్లు నిర్మించిఇవ్వాలని, భూములు కోల్పోయిన రైతులకు ల్యాండ్ కన్వర్షన్ ప్రకారం అందరికి సమానంగా పరిహారం చెల్లించాలని కోరారు. ఇప్పటికే గ్రీన్‌ఫీల్డ్ హైవే వల్ల చాలా మంది రైతులు తమ భూములను కోల్పోయారని, మళ్లీ ఈ రోడ్డు వల్ల రైతులు భూములను కోల్పోయే దుస్థితి వస్తోందని వాపోయారు. అనంతరం తహసీల్దార్ నీలకంఠానికి వినతిపత్రం అందజేశారు.

బాధిత రైతుకు ఆర్థిక సాయం

శృంగవరపుకోట రూరల్:మండలంలోని కొట్టాం గ్రామానికి చెందిన రైతు కడమటి అప్పారావు ప్రమాదంలో ఇటీవల గాయపడడంతో కుటుంబ సభ్యులకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ బుధవారం రూ.20 వేలు అందజేశారు.అలాగే అప్పారావు కుటుంబ సభ్యులకు గ్రామయువత, పెద్దలు మరో రూ.60 వేలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, జామి మండల టీడీపీ అధ్యక్షుడు లగుడు రవికుమార్,గుమ్మడి భారతి, జుత్తాడ రామసత్యం పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి

విజయనగరం రూరల్: బడిఈడు పిల్లలుబడిలోనే ఉండాలని జిల్లా సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.విజయకళ్యాణి కోరారు. బుధవారం విజయనగరంలోని వీటి అగ్రహారం జడ్పీ హైస్కూల్‌లో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్ టచ్.. బాడ్ టచ్, విద్యాహక్కు చట్టం, బాల కార్మిక వ్యతిరేక చట్టం, యాచక బాలల నిరోధంపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో సత్యవతి, ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరరావు, న్యాయవాది తాడి రాజు పాల్గొన్నారు.

రీసర్వేపై ప్రభుత్వ నిర్ణయం ప్రకటించాలి

రామభద్రపురం: గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన రీసర్వే వల్ల రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మజ్జి రాంబాబు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం రామభద్రపురంలో ఆయన విలేకరు లతో మాట్లాడుతూ రీసర్వే వల్ల ఎక్కువ భూములున్న రైతులకు తక్కువ విస్తీర్ణం, తక్కువ భూమి ఉన్న రైతులకు ఎక్కువ విస్తీర్ణం చూపించారన్నారు. రెవెన్యూ కార్యాలయం నుంచి వన్‌బిలు, అడంగళ్లు రాకపోవడంతో భూముల రిజిస్ట్రేషన్ నిలిచిపో యాయని తెలిపారు. దీంతో రైతులు పిల్లలకు పెళ్లిళ్లు, విద్యార్థుల చదువులు నిలిచిపోయాయని తెలిపారు.ప్రభుత్వం స్పందించి స్పష్టమైన ఆదేశాలు జారీచేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రైతు మజ్జి లక్ష్మంనాయుడు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఈశ్వరయ్య

విజయనగరం దాసన్నపేట: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర 49వ మహాసభలు విజయనగరం కేంద్రంగా నవంబరు 27 నుంచి 30వ తేదీ వరకూ జరుగుతాయని, వీటిని జయప్రదం చేయాలని సంఘ జాతీయ మాజీ కార్యదర్శి జి.ఈశ్వరయ్య, ఆహ్వాన సంఘ అధ్యక్షులు పి.కామేశ్వ రరావు పిలుపునిచ్చారు. బుధవారం అమర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విజయనగరంలో తొలిసారిగా రాష్ట్ర మహాసభలు నిర్వహి స్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు, రొంగలి పోతన్న, శివారెడ్డి, ఒమ్మి రమణ, మస్తాన్, బుగత అశోక్, నాగభూషణం, ఆనందరావు పాల్గొన్నారు.

మందుల కొరత లేకుండా చూసుకోవాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో జగన్మోహన్‌రావు



రోగులతో మాట్లాడుతున్న జగన్మోహన్‌రావు

కురుపాం రూరల్: మందుల కొరత లేకుండా చూసుకోవాని డిప్యూటీ డీఎంహెచ్‌వో టి.జగన్మోహన్‌రావు కోరారు. బుధవారం మండలంలోని మొండెంఖల్ పీహెచ్‌సీని పరిశీలించారు. ఈసందర్భంగా ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య, ఆరోగ్య తనిఖీలు, తదితర విషయాలపై ఆరాతీశారు. ల్యాబ్ రికార్డులు తనిఖీ చేసి, మలేరియా జ్వరాల నమోదు వివరాలను పరిశీలించారు. మందుల లభ్యతను అడిగి తెలుసుకున్నారు. కుక్క, పాము కాటు, అత్యవసర చికిత్సలకు అవసరమైన మందులు పీహెచ్‌సీలో కొరత లేకుండా సిద్ధంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీలో వైద్యం అందిన తర్వాత క్షేత్రస్థాయిలో వారిని పర్యవేక్షించేలా సిబ్బందికి సూచించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ హర్ష, ఎపిడెమిక్ ఈవో సత్తిబాబు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

పార్వతీపురంటౌన్: ఆర్టీసీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ కన్వీనర్ బీవీ రమణ, సిటు జిల్లా కోశాధికారి జీవీ రమణ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమావేశంలో వారు మాట్లాడుతూ పార్వతీపురం ఆర్టీసీ డిపో పరిధిలో గల మెకానిక్‌లు, సహాయకులుగా 19 మంది గత పదేళ్ల పని చేస్తున్నారని వివరించారు. సంబంధిత కాంట్రాక్టర్, టెండర్‌లో నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా జీతాలు చెల్లించడం లేదన్నారు. రెండు రోజుల్లోగా కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు

ఉపాధి బిల్లులు చెల్లించాలి



ఎంపీడీవో రమేష్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు, వేతనదారులు

సీతానగరం (బలిజిపేట): ఉపాధి బిల్లులు చెల్లించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బలిజిపేట మండల పరిషత్ కార్యాలయం ముందు బుధవారం పలువురు వేతనదారులు నిరసన చేపట్టారు. సీపీఎం నాయకుడు యమ్మల మన్మథరావుతో కలిసి ఎంపీడీవో రమేష్ వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మన్మథరావు మాట్లాడుతూ ఇప్పటికే మూడు నుంచి ఆరు వారాల బిల్లులు చెల్లించకపోవడం చాలా అన్యాయమని అన్నారు. మండుటెండలో వడదెబ్బకు గురై రెండు పూటలు పనులు చేశారని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005 ప్రకారం పనిచేసిన 14 రోజులకు బిల్లులు చెల్లించాలని, లేనిపక్షంలో వడ్డీతో చెల్లించాలని అన్నారు. చట్టం పకడ్బందీగా అమలు చేయకపోగా చేసిన పనికి కూడా డబ్బులు చెల్లించకపోవడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఇప్పటికైనా డబ్బులు చెల్లించాలని, లేనిపక్షంలో ఎంపీడీవో కార్యాలయాన్ని ఉపాధి కూలీలతో కలిసి ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బొద్దాన భానుమూర్తి, పి.వెంకటస్వామి, జి.బలరామనాయుడు, నల్ల ఈశ్వరరావు, ఆపు సాంబమూర్తి, దన్నాన త్రినాథ, అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందించకపోతే ఉద్యమిస్తాం

● వట్టిగెడ్డను పరిశీలించిన సీపీఎం నాయకులు



చినతోలు మండగూడ వద్ద కాలువలు పరిశీలిస్తున్న గంగునాయుడు, తదితరులు

జియ్యమ్మవలస: వట్టిగెడ్డ రిజర్వాయర్ ద్వారా పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందించకపోతే రైతులతో కలిసి ఉద్యమిస్తామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గంగునాయుడు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండలంలోని అలమండ పంచాయతీ చినతోలుమండగూడ గ్రామ సమీపంలో ఉన్న వట్టిగెడ్డ కాలువను ఆయన బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని రావాడ వద్ద ఉన్న వట్టిగెడ్డ రిజర్వాయర్ కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా 16,680 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉందన్నారు. అయితే నీటి పారుదలశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కనీసం ప్రాజెక్టు దగ్గర్లో ఉన్న అలమండ, తుంబలి, అల్లువాడ పంచాయతీ పరిధిలోని భూములకు సాగునీరు అందడం లేదని తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు ఇంతవరకు సగం భూముల్లో వరినాట్లు వేయని దుస్థితి ఏర్పడిందన్నారు. జంగిల్ క్లియరెన్స్ చేయలేదన్నారు. అలాగే జైకా నిధులు మంజూరైనా నత్తనడకనే పనులు చేశారు తప్ప చిత్తశుద్ధితో ఆధునీకరణ పనులు చేయలేదని ఆయన మండిపడ్డారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బాల్య వివాహాలు నేరం

గరుగుబిల్లి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎంపీపీ ఉరిటి రామారావు, ఉమ్మడి జిల్లాల జడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు అన్నారు. బుధవారం స్థానిక బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాల, పాఠశాలలో కొమరాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసి, పిల్లల భవిష్యత్తును పాడు చేయవద్దని తల్లిదండ్రులకు హితవు పలికారు. ఐసీడీఎస్ పీవో సుగుణకుమారి మాట్లాడుతూ బాలల అక్రమ రవాణా, బాలికలకు ఆపద సమయంలో అవసరమైన సహాయం కోసం చైల్డ్ కేర్ హెల్ప్‌లైన్‌ను ఎలా స్పందించాలో సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.ఇందుమతి, ఎంపీటీసీ సభ్యురాలు దేవాతి జోజి, ఈవోపీఆర్డీ ఎల్‌గోపాలరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల ఆర్.లక్ష్మి, పి.అరుణకుమారి, ఎల్.శారదాంబ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రచయితలు, కవులకు గంటేడ స్ఫూర్తి



నాగావళి నడకలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: నేటి సమాజంలోని కవులు, రచయితలకు ప్రముఖ కవి, గేయ రచయిత, గాయకుడు గంటేడ గౌరునాయుడు స్ఫూర్తి అని సాహితీలహరి అధ్యక్షుడు డా.మంచిపల్లి శ్రీరాములు, ప్రముఖ సాహితీవేత్త చదలవాడ సత్యనారాయణ అన్నారు. బుధవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో స్నేహకళా సాహితీ ఆధ్వర్యంలో గౌరునాయుడు రచించిన నాగావళి నడకలు, ఆయన మిత్రులు రాసిన 'నీ స్ఫూర్తి' పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్నేహకళా సాహితి అధ్యక్షుడు జి.రామకృష్ణ, రచయితలు, పి.రామలింగస్వామి, ఎం.జగదీష్, పక్కి రవీంద్ర, అప్పలనాయుడు, టి.ప్రకాశరావు, ఎంవీఆర్ శర్మ, ఎస్.స్వామినాయుడు, ఎం.రమేష్, కె.నాగు, విశ్రాంత తహసీల్దార్ జి.అప్పలరాజు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

కొమరాడ: మండలంలో మాదలంగి జడ్పీ ఉన్నత పాఠశాలను డీఈవో జి.పగడాలమ్మ గురువారం సందర్శించారు. ఈసందర్భంగా ఆమె పదో తరగతి విద్యార్థులతో మమేకమై వారి విద్యా సామర్థ్యాలను తెలుసుకున్నారు. పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు త్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని తెలుసుకుని హెచ్‌ఎంను, ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాల వాతావరణం చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు.

వసతిగృహం తనిఖీ

సాలూరు రూరల్: మావుడి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను మామిడిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డి.శివకుమార్ బుధవారం తనిఖీచేశారు. జ్వరాలతో బాధపడుతున్న ఇద్దరు విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. వారిలో ఒకరికి మలేరియా జ్వరం కావడంతో మెరుగైన చికిత్స కోసం మామిడిపల్లి పీహెచ్‌సీకి తరలించారు. మావుడిలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ వైద్యశిబిరంలో 36 మందికి వైద్యసేవలు అందించారు. 9మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. మామిడిపల్లి పీహెచ్‌సీకి వచ్చి రక్తహీనత నివారణకు ఇంజక్షన్లు ఇస్తామన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

పార్వతీపురంటౌన్: పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావుతో పాటు ప్రజారోగ్యశాఖాధికారులకు ఎమ్మెల్యే బి.విజయచంద్ర సూచించారు. బుధవారం వివిధ వార్డుల్లోగల కాలువలతో పాటు వరహాల గెడ్డలో పూడికత పనులకు జరిగిన యంత్ర పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కూడా పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి తదితరులు పాల్గొన్నారు. ● పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములం అవుదామని ఎమ్మెల్యే విజయచంద్ర పిలుపునిచ్చారు. బుధవారం జట్టు ఆశ్రమంలో ఆయన మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్య నివారణతో పాటు ప్రాణవాయువును అందించడంలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

ఘనంగా మజ్జిగౌరమ్మతల్లి వారాల పండుగ

మక్కువ: మక్కువలో మజ్జిగౌరమ్మతల్లి వారాల పండగను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏటా స్థానిక కుమ్మరి కులస్తులు శ్రావణ మాసంలో మజ్జి గౌరమ్మ వారాలు నిర్వహించడం ఆనవాయితీ. గ్రామస్థులంతా ఊరేగింపుగా వెళ్లి శివారు గడ్డె వద్ద అమ్మవారికి కోళ్లు, చీరలు మొక్కులు చెల్లించుకున్నారు.

పరిసరాల శుభ్రతతో దోమల నివారణ

భామిని: పరిసరాల పరిశుభ్రంగా ఉంచడంతో దోమల నివారణ చేపట్టవచ్చునని మలేరియా సబ్ యూనిట్ అధికారి అప్పారావు అన్నారు. భామిని గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. పరిసరాలు పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల వార్డెన్ బి.రవి, హెచ్‌వి గౌరీశ్వరి, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

తల్లిపాలు పిల్లలకు సంజీవని

● ముగిసిన వారోత్సవాలు

పార్వతీపురం టౌన్: తల్లిపాలు పిల్లలకు సంజీవని లాంటివని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గిరిమిత్ర సమావేశ మందిరంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలు తాగిన పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శోభారాణి, మహిళా, శిశు సాధికారిత అధికారి ఎంఎం.రాణి, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి బి.శ్రీనివాసరావు ఎంఈవో కె.ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

● తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో బుధవారం అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవోలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సాలూరు: తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రమాణం చేస్తున్న దృశ్యం



కురుపాం: గర్భిణులకు సామూహిక సీమంతాలు



గరుగుబిల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



పార్వతీపురం టౌన్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర



భామిని: అవగాహన కల్పిస్తున్న సీడీపీవో శాంతిభవానీ

చేతి వృత్తుల సంక్షేమమే లక్ష్యం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు



చేనేత కార్మికులను సన్మానిస్తున్న శ్రీనివాసరావు

పార్వతీపురంటౌన్: మన సంస్కృతీ సంప్రదాయాలకు ఆనవాళ్లయిన చేనేత వృత్తుల సంక్షేమమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని బీజేపీ మన్యం జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక బైపాస్ రోడ్డులో గల పార్టీ కార్యాలయంలో జాతీయ చేనేత దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటూ కేంద్రంలోని బీజేపీ చేనేత రంగానికి అండగా నిలబడిందన్నారు. చేనేత కార్మికులను ఆర్థికంగా బలోపేతం చేయాలనే సంకల్పంతో విశ్వకర్మ యోజన ద్వారా ఏడాదికి రూ.లక్ష వడ్డీ లేని రుణం ఇస్తోందని తెలిపారు. అనంతరం చేనేత కార్మికులను ఘనంగా సత్కరించారు. జాతీయ చేనేత దినోత్సవంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఖాదీ కార్మికులను సన్మానించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

సీతంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వి.ప్రభాకరరావు మాట్లాడుతూ చేనేత రంగం భారత సాంస్కృతిక వారసత్వ చిహ్నమన్నారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ ఎం.రవికిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చేనేత దినోత్సవం

పాలకొండ: దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అతిపెద్ద రంగం చేనేత రంగమని పాలకొండ ఆర్డీవో వీవీ రమణ అన్నారు. బుధవారం స్థానిక కోటదుర్గ వీవర్స్ సొసైటీలో జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, వీవర్స్ కాలనీ వరకు భారీ ర్యాలీ చేశారు. సొసైటీ ఆవరణలో ఏర్పాటుచేసిన చేనేత ఉత్పత్తు ఎగ్జిబిషన్‌ను ఆర్డీవో తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేతన్నలను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని పథకాలు అమలు చేసిందన్నారు. చేనేత ఉత్పత్తులకు కేంద్ర ప్రభుత్వం తరఫున ముద్రలోన్ అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇద్దరు చేనేత కళాకారులను సత్కరించారు. 12 మంది నేతవారికి మగ్గం, ఉపకరణాలు అందించారు. ఈ కార్య క్రమంలో చేనేత జౌళిశాఖ సహాయ అభివృద్ధి అధికారి నల్ల వెంకటరమణ, చేనేత రంగ ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

చేనేతను బతికిద్దాం

చేనేతను బతికిద్దామని బీజేపీ జిల్లా మహిళా మోర్చ అధ్యక్షురాలు గొటివాడ చంద్రమ్మ అన్నారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పట్టణంలోని వీవర్స్‌కాలనీలో ఉన్న చేనేత షెడ్‌లో పలువురు చేనేత కార్మికులను సత్కరించారు. మోడీ ప్రభుత్వం అందిస్తున్న చేనేత సంక్షేమ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బురిడి సీతాలక్ష్మి, చుక్క మహాలక్ష్మి, చిట్టి రాంబాబు పాల్గొన్నారు.



పాలకొండ: చేనేత కార్మికులకు అందిస్తున్న కేంద్ర ప్రభుత్వ పథకాలపై వివరిస్తున్న దృశ్యం

గిరిజన యువత ఉపాధికి శిక్షణ



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: స్థానిక యువత శిక్షణ కేంద్రం (వైటీసీ)లో నూతనంగా నిర్మించిన సామూహిక స్నానాల గదులు, వాటర్ ట్యాంకును ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం ప్రారంభించారు. అనంతరం గర్భిణుల వసతిగృహంలో ఉన్న మహిళలకు సామూహిక సీమంతాలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గిరిజన యువతకు విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉపాధి సంబంధిత శిక్షణ త్వరలో ప్రారంభించనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు యోగిరెడ్డి తిరుపతి నాయుడు, వైటీసీ మేనేజర్ అన్నువ రాము, డీఈ సింహాచలం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కడ్రక మల్లేష్, టీడీపీ నాయకులు పాడి సుధ, వెంపటాపు భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి నియోజకవర్గ సమస్యలు



మంత్రికి సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ: రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అమరావతిలోని ఆమె చాంబర్‌లో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని సమస్యలను ఆమెకు వివరించారు. నగర పంచాయతీలో సంవత్సరాలుగా పీడిస్తున్న సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కర్నేన అప్పలనాయుడు, గర్భాన సత్తిబాబు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను కలిసి జనవాణి కార్యక్రమంలో జనసేన అధినేత పవన్‌కళ్యాణతో కలిసి వినతులను జయకృష్ణ పరిశీలించారు.

వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే

పార్వతీపురం రూరల్: వెంకమ్మపేట పంచాయతీ పరిధిలో ఉన్న తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం ప్రజల సమస్యలపై ఎమ్మెల్యే విజయచంద్ర వినతులు స్వీకరించారు. పార్వతీపురం, బలిజిపేట, సీతానగరం మండలాలతో పాటు పార్వతీపురం పట్టణానికి చెందిన అనేక మంది తమ వ్యక్తిగత సమస్యలతో పాటు రహదారులు, కాలువల నిర్మాణం తదితర సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి.. సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

సీతంపేట రూరల్: గిరిజన ప్రాంతాల్లో గిరిజనుల కోసం ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని శ్రీకాకుళం జిల్లా న్యాయ సలహా విభాగం సెక్రటరీ ఎస్.సన్యాసినాయుడు సూచించారు. మండలంలోని టిటుకుపాయి గ్రామంలో శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవా విభాగం ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సన్యాసినాయుడు మాట్లాడుతు గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులకు ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. గిరిజనులు మూఢ నమ్మకాలను విడచిపెట్టి ఎవరికైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే ఆసుపత్రులకు వెళ్లి చికిత్స చేయించు కోవాలని ఆయన సూచించారు. ఈ శిబిరంలో దోనుబాయి పీహెచ్‌సీ వైద్యాధికారి భాను ప్రసాద్, సీడీపీవో రంగలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ అదనపు భవనానికి కొలతలు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ అదనపు భవనానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం ఆరోగ్య కేంద్రం ఆవరణలో కొలతలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్‌అండ్‌బీ జేఈ పి.ప్రమీల మాట్లాడుతూ భవన నిర్మాణానికి వైద్యశాఖ రూ.50లక్షలు మంజూరు చేసిందని చెప్పారు. వాతావరణం సహకరిస్తే నిర్దేశించిన సమయంలోగా పనులు పూర్తి చేస్తారని తెలిపారు. అలాగే ఉల్లిభద్ర నుంచి పాలకొండ వైపు వెళ్లే ప్రధాన రహదారి మరమ్మతులకు ప్రతిపాదనలు చేశామని చెప్పారు.

ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

గుమ్మలక్ష్మీపురం: ఈనెల 9న గుమ్మలక్ష్మీపురంలో జరగనున్న ఆదివాసీ ఉత్సవాన్ని విజయవంతం చేయాలని గిరిజన సంఘాలు కోరాయి. కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని కలిసి ఉత్సవ ఏర్పాట్లు తదితర అంశాలపై బుధవారం చర్చించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు, మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి, గిరిజన నాయకులు మండంగి రమణ, క ద్రక మల్లేష్, క్రాంతికుమార్ తదితరులున్నారు.

హక్కుల కోసం ఉద్యమిద్దాం

పార్వతీపురం టౌన్: ఆదివాసీ హక్కుల కోసం ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి అన్నారు. బుధవారం స్థానిక గిరిజన సామాజిక భవనంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో నాణ్యమైన విద్య వైద్యం, ఉపాధి కరువయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పండు, అఖిల్, డేవిడ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

పాలకొండ: ఎం.సింగుపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం స్థానిక అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు విద్యార్థులకు అగ్ని ప్రమాదాలు, వాటి నివారణపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు నివారణకు వినియోగించే పరికరాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సంగంనాయుడు, ఉపాధ్యాయులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

పొలం గట్టే దారి

● రహదారి సౌకర్యం లేక గిరిజనుల అవస్థలు



మహిళను డోలీలో తీసుకెళుతున్న గిరిజనులు

మక్కువ: మెట్టలోవరఖండి గ్రామానికి రహదారి సౌకర్యం లేక గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెట్టలోవరఖండి గ్రామానికి చెందిన మెల్లిక దిగుడమ్మ అనే గిరిజన మహిళ గత కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ఆరోగ్య సిబ్బంది వైద్య సేవలు అందించి నా తగ్గకపోవడంతో బుధవారం మక్కువలోని ఓ ప్రైవే టు ఆసుపత్రికి తరలించారు. అయితే గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంలో డోలీ కట్టి పొలం గట్లుపై నడుచుకుంటూ దబ్బగడ్డ, కొత్తపట్నం రోడ్డుకు తరలించి, అక్కడ నుంచి ఆటోలో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకొని వెళ్లారు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం రహదారులపై దృష్టి సారించాలని గిరిజనులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పార్వతీపురం టౌన్: పట్టణంలో గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ మురళి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఫీడర్ పరిధిలోని ఇందిరా కాలనీ, రామాపురం కాలనీ, గాంధీ సత్రం, దేవీనగర్, పార్వతీనగర్, చినకుమ్మరి వీధి, రెడ్డి వీధి, టౌన్ నాయుడువీధి, వేమకోటి వారి వీధి, పండా వీధి, కుసుమగుడి వీధి, కంచర, గౌడు, భేరి, కోసూరువారి వీధి, పిల్లా వీధి, హరిజన వీధులతో పాటు కృష్ణపల్లి గ్రామానికి విద్యుత్ నిలిపివేయనున్నట్లు చెప్పారు.

రాయగడలో ఎయిర్‌పోర్టు పెట్టాలి: ఎంపీ

ఒడిశా

రాయగడ: పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న రాయగడలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని ఎంపీ సప్తగిరి ఉలక కోరారు. ఈ మేరకు పార్లమెంటులో జీరో అవర్‌లో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ఈ విషయాన్ని లేవనెత్తారు. రాయగడ జిల్లాలో పేరెన్నికగల పరిశ్రమలు ఉన్నాయని, జిల్లాకు చెందిన అనేకమంది వివిధ పనులపై చెన్నయ్, బెంగుళూర్, హైదారాబాద్, బొంబాయ్, ఢిల్లీ వంటి నగరాలకు రాకపోకలు చేస్తుంటారని చెప్పారు. ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం జైపూర్ షుగర్ పరిశ్రమ నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న సుమారు 500 ఎకరాల్లో ఎయిర్‌పోర్టు, మెడికల్ కళాశాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. దీంతోపాటు జైపూర్ ఎయిర్‌పోర్టును ఆధునికీకరించాలన్నారు. 1200 మీటర్ల పొడవు నుంచి 2,700 మీటర్లకు, 30 మీటర్ల వెడల్పు నుంచి 45 మీటర్లకు పెంచాలని 2సీ కేటగిరి నుంచి 3సీ కేటగిరికి మార్చాలను, అందుకు తగ్గ నిర్ణయాలు త్వరగా తీసుకోవాలని ఆయన కోరారు.

ఆదివాసీ సభకు భాస్కరరావు విరాళం

రాయగడ: స్థానిక జీసీడీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించేందుకు జిల్లా ఆదివాసీ సమాజం ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే క్రీడా మైదానంలో అన్ని ఏర్పాట్లు చేశారు. బిజద రాష్ట్ర ఉపాధ్యాక్షుడు, జిల్లా అధ్యక్షుడు, పూర్వ రాజ్యసభ సభ్యుడు నెక్కంటి భాస్కరరావు ఆదివాసీ సభల కోసం రూ.50వేల చెక్కును జిల్లా ఆదివాసీ సమాజ నాయకులకు బుధవారం అందజేశారు.

చేనేత వస్త్రాలతో ప్రత్యేక ఆకర్షణ

రాయగడ: చేనేత వస్త్రాలు వినియోగిస్తే హుందాతనంతో పాటు ప్రత్యేక ఆకర్షణ చేకూరుతుందని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ అన్నారు. జాతీయ చేనేత వస్త్ర దినోత్సవం సందర్భంగా స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రౌయిత్, సబ్‌కలెక్టర్ కళ్యాణి సంఘమిత్ర దేవి, గుణుపురం సబ్‌కలెక్టర్ కిరణ్‌దీప్ కౌర్, అన్ని సమితుల బీడీవోలు అధికారులు చేనేత వస్త్రాలు ధరించారు. వారంలో ఒక రోజు విధిగా అధికారులంతా ఒడిశా చేనేత కార్మికులు నేసిన వస్త్రాలను ధరించాలని చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ అరవిందపాఢి ఆదేశించారు.



చేనేత వస్త్రాలను ధరించిన కలెక్టర్ ఇతర అధికారులు